క్లుప్తంగా

కనీస వేతనాలు ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మున్సిపల్ కార్మికుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తిస్తూ కనీస వేతనం రూ. 24 వేలు వర్తింపజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళ వారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని, క్లాప్ మిత్ర, ఆటో డ్రైవర్ల, ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు పెంచి ఆప్కోస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జీ. వేణు గోపాల్, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే.సి బాదుల్లా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు గోవిందు,ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అసంఘటిత రంగ కార్మికుల శ్రేయస్సు కోసం సమగ్ర చట్టం తేవడంతోపాటు పాలక ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. కడప రైల్వే స్టేషన్ ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్మికుల హక్కులను కాలరాస్తోందని, 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను తీసుకొచ్చి కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకే ఊడిగం చేస్తున్నదని ఆరోపించారు. ఈ సమావేశంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ.బాదుల్లా, ఎస్ మహబూబ్ బాషా, నాయకులు పాల్, చిన్న ఓబులేసు, శ్రీను, నాగేంద్ర,సూరి, గంగయ్య, సుబ్బారామ్, రంగ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఓటర్ల ముసాయిదా జాబితాపై డిసెంబరు 9వ తేది వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. మంగళవారం కడప ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 17వ తేదీ వరకు మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించామన్నారు. వాటిలో మార్పులు, చేర్పులు చేసి ఆ తర్వాత నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 9 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని వారం, పదిరోజుల్లో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని వివరించారు. అందులో మృతి చెందిన వారి పేర్లను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, వివిద రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నకిలీ ఉల్లి విత్తనాలు విక్రయించే డీలర్ పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షులు గాలి చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని వీఎన్ పల్లె మండలంలోని పాయసంపల్లి, ఇందుకూరు, కీర్తిపల్లె, తలపనూరు, అడవి చెర్లోపల్లి, కొమ్మద్ది తదితర గ్రామాల రైతులు పంచగంగ ఉల్లి విత్తనాలు కొనుగోలు చేసి తమ పొలాల్లో విత్తడం జరిగిందన్నారు. అయితే అవి మొలకెత్తకపోవడం వల్ల రైతులు నష్టపోయారన్నారు.

దస్తావేజు లేఖర్లకు ఉపాధి కల్పించాలి



నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రిజిస్ట్రేషన్, స్టాంప్‌ల శాఖలో అనాదిగా దస్తావేజులు రాసుకుంటూ స్టాంపులు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్న లేఖర్లు, వెండర్ల జీవనోపాధిని కాపాడాలని దస్తావేజు లేఖర్ల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, నగర అధ్యక్షులు యు. సంజీవరాయుడు కోరారు. మంగళవారం పాత రిమ్స్‌లోని కడప రూరల్, అర్బన్ సబ్ రిజిస్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్, స్టాంప్ శాఖలో నూతనంగా ప్రవేశపెడుతున్న ప్రైమ్ 2.0 విధానం వలన రాష్ట్రవ్యాప్తంగా స్టాంప్ వెండర్లు, రైటర్లు ఉపాధి కోల్పోతున్నారన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ప్రైమ్ 2.0 విధానాన్ని ఉపసంహరించుకొని పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్లు చేసే విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి నాయకులు ఓబులేసు, ఇక్బాల్, సుబ్బరాయుడు, లోకనాథం, సురేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కార్తీక దీపం... సర్వపాప వినాశనం



శివ భక్తులకు అత్యంత ఇష్టమైన కార్తీక మాసం సోమవారం ప్రారంభమైంది. దీన్ని శివభక్తులు శుభ సూచకంగా భావిస్తున్నారు. శివాలయాలలో ఈ మాసమంతా జరగాల్సిన పూజలకు ముందే ఏర్పాట్లు చేసుకోవడంతో ఆలయ ప్రాంగణాలన్నీ సందడిగా మారుతున్నాయి. ఉదయం, సాయంత్రం విశేష పూజలు చేసేందుకు వస్తున్న భక్తులతో ఆలయాలు కళకళలాడతాయి. ఈ సందర్భంగా నగరంలో కార్తీక పూజలు విశేషంగా జరిగే ఆలయాల వివరాలు.

- కడప కల్చరల్



శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం

ఇది జిల్లాలోగల అత్యంత పురాతన ఆలయం. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం తర్వాత కొద్దిరోజులకే ఈ ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. ఈ రెండు ఆలయాలకు ఒకే పుష్కరిణి ఉండడం ఈ విషయాన్ని ధృవీకరిస్తోంది. విశాలమైన ప్రాంగణం ఉండడంతో కార్తీకమాసంలో భక్తులు ఈ ఆలయ ఆవరణంలో పెద్ద ఎత్తున దీపాలను వెలిగిస్తారు.

శ్రీ ప్రసన్న విశ్వేశ్వరాలయం

మోచంపేటలోగల ఈ ఆలయాన్ని కడప నగరం ఏర్పాటైన కొత్తలో నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో తూర్పు ముఖుడైన స్వామికి ఉత్తర దిశన అమ్మవారిని దక్షిణ ముఖంగా ఏర్పాటు చేశారు. పాత ఆలయం శిథిలం కావడంతో రెండేళ్ల క్రితం నూతన ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆలయం నాలుగు వైపుల తగినంత ఖాళీ స్థలం ఉండడంతో భక్తులు ఉదయం, సాయంత్రం దీపాలను వెలిగిస్తారు.

శ్రీ సోమసుందరేశ్వరాలయం

వందేళ్ల చరిత్రగల ఈ ఆలయానికి నగరంలో ప్రముఖ శివాలయంగా పేరుంది. కార్తీకమాసంలో భక్తులు ఈ ఆలయానికి పెద్ద సంఖ్యలో హాజరై విశేష పూజలు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం



దేవుని కడపలోని సోమేశ్వరస్వామి ఆలయం

విశేష అభిషేకాలు, అలంకారం నిర్వహిస్తారు. ప్రత్యేకమైన రోజున శివునికి అన్నాభిషేకం నిర్వహిస్తారు. స్వామి ఆలయానికి ఉత్తరాన శ్రీ కళాంబదేవి కొలువై ఉన్నారు.

శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం

కడప నగరంలో కార్తీక మాసమంతా భక్తులతో కిటకిటలాడే ఆలయాలలో మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం ప్రముఖంగా నిలుస్తోంది. కార్తీకమాసమంతా భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయంలో పూజలు చేస్తారు. ఉదయం, సాయంత్రం కూడా కార్తీక దీపాల సందడి ఉంటుంది.

నబీకోట శివాలయం

కడప నగరంలో దక్షిణ దిశగా ఉన్న శివాలయాలలో



నబీకోటలోని శివాలయం

నబీకోట శివాలయం ప్రముఖమైనది. ప్రాచీనమైన ఆలయంగా పేరుగాంచిన ఇందులో కార్తీకమాసమంతా విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ మాసంలో ప్రతిసోమవారం ఉదయం, సాయంత్రం ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించడంతోపాటు అక్కడి నాగుల విగ్రహాలకు కూడా భక్తులు పూజలు చేస్తారు. ప్రతిరోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తారు.

శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం

కడప మున్సిపల్ మైదానంలోగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం కార్తీక మాసమంతా భక్తులతో సందడిగా ఉంటుంది. ఉదయం స్వామికి రుద్రాభిషేకాలు చేసినంతరం విశేష అలంకారం నిర్వహిస్తారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేసుకునేందుకు ఏర్పాట్లు ఉన్నాయి.

విద్యార్థులకు పోటీలు

కడప కల్చరల్ : జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నారు. 15న ఉదయం 8 గంటలకు పుస్తక ప్రదర్శన, 10 గంటలకు చదరంగం పోటీలు, 10.30కు పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. 16న ఉదయం 10 గంటలకు పాఠశాల విద్యార్థులకు క్విజ్, మధ్యాహ్నం 2 గంటలకు చిత్రలేఖన పోటీలు, 5 గంటలకు బహుభాషా కవి సమ్మేళనం, 17న ఉదయం 10 గంటలకు వక్తృత్వ పోటీలు, సాయంత్రం 5 గంటలకు గ్రంథాలయ ఉద్యమ నాయకులపై ప్రసంగాలు నిర్వహించనున్నారు. 18న ఉదయం 10 గంటలకు పురాతన నాణేల ప్రదర్శన, 19న ఉదయం 10 గంటలకు ఉత్సవాల ముగింపు సభ నిర్వహిస్తారు.

అలరించిన చిన్నారుల ప్రదర్శన

మంగళవారం జరిగిన కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులకు జాతీయ నాయకుల వేషధారణ పోటీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కడప ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు, ట్రబుల్‌మాంగర్స్‌కు మంగళవారం కడప ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. సమస్యలు ఏవైనా వుంటే పోలీస్‌స్టేషన్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీవ్రంగా వుంటాయని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, ఎస్‌ఐలు తులసీనాగప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

- కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం హత్య సంఘటనల నిందితులు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌కు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు.

మధుమేహం పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మధుమేహ వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్, ఆరోగ్య అధికారిణి ప్రసన్నలత తెలిపారు. మంగళవారం నాగరాజుపేట పీహెచ్‌సీ సెంటర్‌లో మధుమేహం వ్యాధిపై రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఇతర వైద్య సిబ్బందితో కలిసి వారు ఆవిష్కరించి మాట్లాడారు. వైద్యులు జ్యోతిష్, కారుణ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగనన్న అవసరం ఎంతో ఉంది

– ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా అక్కాయపల్లె సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన పాల్గొని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాకా సురేష్ కుమార్‌తో కలిసి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు కలిగిన లబ్ధి గురించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గుర్తించాలని, 2024లో మళ్లీ జగనన్నను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి రెడ్డి ప్రసాద్, 40వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. బాలస్వామిరెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.



అక్కాయపల్లెలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పాకా సురేష్

దేవునికడపలో ....

కడప నగరం 2వ డివిజన్‌లోని దేవునికడపలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు తోటక్రిష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మల్లికార్జున, 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, రైతు విభాగం నగర అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా వారు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల డివిజన్‌కు, అక్కడి ప్రజలకు కలిగిన



రాజీవ్ పార్కు వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్ర పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి చెందాలంటే జగనన్నే మళ్లీ రావాలి

వైఎస్సార్ జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నా, ప్రస్తుతం జరుగుతున్న పనులు పూర్తి కావాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని డిప్యూటీ మేయర్ బి. నిత్యానంద రెడ్డి, క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు పి. జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక 20వ డివిజన్‌లోని ఏపీహెచ్‌బీ కాలనీలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ పార్కు వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్ విజయమ్మ పార్కులో సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్నాలుగేళ్ల టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ జిల్లాలో చెప్పుకోదగిన అభివృద్ధి కార్యక్రమం ఒక్కటీ చేపట్టలేదన్నారు. వైఎస్ హయాంలోనే జిల్లా అభివృద్ధి జరిగిందని, మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే జరుగుతోందని తెలిపారు. 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ నాలుగేళ్లలో తమ డివిజన్‌లో సుమారు రూ.14కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, సుమారు 39 పథకాల ద్వారా రూ.11.85కోట్లు ప్రజల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎన్‌వీ రమణారెడ్డి, నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి రామలక్ష్మణ్‌రెడ్డి, 20వ డివిజన్ కార్పొరేటర్ మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్ రెడ్డి, 21వ డివిజన్ ఇన్‌చార్జి సుబ్బరాయుడు, అర్జున్, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

చాచా నెహ్రూకు జేజేలు

తెల్లని కోటు, చల్లని నవ్వు, ఎదపై ఎర్రగులాబీ ఆయన రూపాన్ని వర్ణిస్తే ఆయనెవరో మన దేశంలోని పిల్లలు కూడా చెప్పేస్తారు. ఆయనే బాలల నేస్తం, మన దేశ తొలి ప్రధాని, సంస్కరణవాది పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ. ఆయన జయంతిని కడప నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యానికి, దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



కడప ఎడ్యుకేషన్: విజేతలుగా నిలిచిన విద్యార్థులతో సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, బాలోత్సవ కమిటీ సభ్యులు

కడప కార్పొరేషన్: భారత దేశానికి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎన్‌వీ రమణారెడ్డి అన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ హిదాయతుల్లా, డీఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : స్థానిక నజ్ముల్ అమీన్ హైస్కూలులో ఇన్‌ఛార్జి రజియా, ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాష ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలకు స్పందన లభించింది.

- స్థానిక అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో నెహ్రూ చిత్రపటానికి చిన్నారులతో పూలమాల అలంకరింపజేశారు. బాలలకు స్వీట్లు పంపిణీ చేశారు.

- కడప నగరానికి చెందిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మహిళా విభాగం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ముత్తరాసుపల్లె జెడ్పీ హైస్కూలులో నిర్వహించిన పలు రకాల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అవోపా మాజీ అధ్యక్షులు బుధవరపు కృష్ణమూర్తి, అధ్యక్షులు ఆకుల వెంకట సత్యసాయి ప్రసాద్, కోశాధికారి వంకధారి చంద్రశేఖర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: భారతదేశపు మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైవీయూ: కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేకాధికారి శివశంకర్‌రెడ్డి, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, ఏపీజీబీ ఏజీఎం పురుషోత్తంరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నెహ్రూ యువకేంద్రం వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని 'హ్యాండ్స్ ఫర్ యూ' ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్స్ ఫర్ యూ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావు, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు అశోక్, విజయ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చిత్రలేఖన పోటీలు ఎంతో ఉపయోగపడతాయని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, యస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డిలు అన్నారు. బాలల దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఇటీవల బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా కమిటీ నాయకులు లక్ష్మిరాజా, రాజశేఖర్ రాహుల్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖన పోటీలలో నిర్వహించారు. ఇందులో విజేతలకు మంగళవారం కడప యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో బహుమతులను ప్రదానం చేశారు.

- గ్రామీణ విద్యార్థులలో ఆలోచన శక్తిపెరగడంతోపాటు నైపుణ్యాలను వెలికి తీసే కార్యక్రమాలను చేపట్టాలని విద్యాశాఖ రీసోర్సుపర్సన్, ఏకలవ్య ఫౌండేషన్ సలహాదారు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఏకలవ్య ఆధ్వర్యంలో కడప మండలం ఆలంఖాన్‌పల్లె జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఇంటింటి ఆరోగ్య పరిశుభ్రత సర్వే పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బహుమతులను ప్రదానం చేశారు. సైన్సు కో ఆర్డినేటర్ డీవీ సుబ్బానాయుడు, హెచ్‌ఎం పర్వతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- కడప భగత్‌సింగ్‌నగర్‌లో ఉన్న దిన్నెపాటి బసిరెడ్డివికాస్ స్కూల్లో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కరస్పాండెంట్ బసిరెడ్డి మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- ధైర్యంతో ముందడుగు వేస్తే విజయం సిద్ధిస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, సాయిబాబా విద్యాసంస్థల అధినేత ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. నెహ్రూ జయంతిని మంగళవారం కడప సాయిబాబా స్కూల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి, సాయిబాబా విద్యాసంస్థల సీఈఓ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- విద్యా శ్రేయస్సుకు ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడాలని వక్కలపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల హెడ్‌టీచర్, ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్ నజీబుల్లా అన్నారు. మంగళవారం వక్కలపేట స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

- కడప నగర శివార్లలోని హెలెన్ కెల్లర్ బధిరుల పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్, ప్రిన్సిపాల్ మసుదబేగం ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

- సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్‌నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌బాష బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కడప అంగడివీధిలోని విశ్వభారతి ఎయిడెడ్ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పిల్లలకు సౌకర్యాలను అందించాలి

కడప అర్బన్: పిల్లలకు అన్ని సౌకర్యాలను అందించాలని కడప వైఎస్‌ఆర్‌సీపీ యువనాయకుడు షేక్ ఉమైర్ అన్నారు. మంగళవారం నెహ్రూ జయంతి సందర్భంగా కడపలోని ప్రభుత్వ బాలుర గృహంలో ఘనంగా నిర్వహించిన బాలల దినోత్సవానికి షేక్ ఉమైర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో రెండవ అదనపు మెజిస్ట్రేట్ కె. భార్గవి, సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైవీయూ: రక్తదానం చేస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు



కడప కార్పొరేషన్: నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి



కడప కల్చరల్ : అల్‌షిఫాలో నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



కడప అర్బన్: ప్రభుత్వ బాలుర గృహంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



కడప ఎడ్యుకేషన్: బసిరెడ్డి వికాస్ స్కూల్‌లో బాలల దినోత్సవం



రాహుకాల పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు.



నషాన్ ఉత్సవం

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రమైన అమీన్‌పీర్ దర్గాలో కొలువైన హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఉరుసు ఉత్సవాల ప్రారంభాన్ని సూచిస్తూ నషాన్ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులతో కలిసి పూలతో రూపొందించిన నషాన్‌ను ఊరేగింపుగా మంగళ వాయిద్యాలు, ఖసాయత్ ఖానీలతో మై అల్లా దర్గా నుండి తీసుకొచ్చారు. నగరంలోని ప్రధాన వీధుల ద్వారా ఊరేగింపుగా పెద్దదర్గాకు చేర్చారు. అనంతరం హజరత్ ఖ్వాజా సయ్యద్ షా పీరుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్తివుల్ ఖాద్రి దర్గా గుంబద్‌పై అలంకరించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా ఫాతేహా (చదివింపులు) నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.